andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.1 ; కనిష్ఠం 22.8

ఆంధ్రజ్యోతి



నిజామాబాద్
జిల్లా వార్తలు

5 గురువారం 19 సెప్టెంబరు 2024



పేకాటరాయుళ్లపై 'మహా' నజర్!

పేకాటకు మహారాష్ట్ర వెళ్లేవారు యూటర్న్!

- పేకాట స్థావరాలపై దాడులు చేస్తున్న మహారాష్ట్ర పోలీసులు
- యూటర్న్ తీసుకుంటున్న జిల్లాకు చెందిన పేకాట రాయుళ్లు
- జిల్లాలోనే కొత్తగా పేకాట స్థావరాల ఏర్పాటుకు ప్రయత్నాలు
- పేకాట నియంత్రపై దృష్టి సారించిన జిల్లా పోలీసులు

ఖిల్లా, సెప్టెంబరు 18: పేకాట రాయుళ్ల ఆటలకు మహారాష్ట్ర పోలీసులు అడ్డుకట్ట వేస్తున్నారు. జిల్లా నుంచి ప్రతిరోజూ పేకాట ఆడేందుకు మహారాష్ట్రకు వెళ్తున్న వారిపై అక్కడి పోలీసులు నజర్ పెట్టారు. పేకాట స్థావరాలపై మహారాష్ట్ర పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. దీంతో చేసేదేమి లేక జిల్లాకు చెందిన పేకాటరాయుళ్లు యూటర్న్ తీసుకుంటున్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి సైతం పేకాట ఆడేందుకు నిత్యం వందల సంఖ్యలో పేకాట ఆడేందుకు మహారాష్ట్రకు వెళ్లేవారు. కానీ ప్రస్తుతం అక్కడ పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో మహారాష్ట్రకు వెళ్లడం మానివేశారు. దీంతో జిల్లాలోనే పేకాట ఆడేందుకు కొందరు కొత్తగా స్థావరాలను వెతికే పనిలో పడ్డారు.

జిల్లాలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

జిల్లాలో పేకాటను నియంత్రించేందుకు పోలీసు కమిషనర్ దృష్టి సారించారు. పేకాటరాయుళ్ల ఆటకట్టించేందుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను నియమించి జిల్లాలో పేకాటను కూకటివేళ్లతో పెకిలించడానికి జిల్లా వ్యాప్తంగా దాడులు జరుపుతున్నారు. దీంతో పేకాటకు పెట్టింది పేరుగా ఉన్న ఆర్మూర్ డివిజన్‌తో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పేకాట ఆడేవారు తమ మఖామును పక్క రాష్ట్రానికి మార్చారు. అందుకు సేఫ్‌జోన్‌ను ఎన్నుకుని అక్కడికి వెళ్లి నిర్భయంగా పేకాటాడేవారు. జిల్లాకు సరిహద్దు అయిన మహారాష్ట్రంలోని పలు పట్టణాల్లో పేకాటను యథేచ్ఛగా నడిపించే వారు. అక్కడి పోలీసులు పట్టించుకోక పోవడంతో ఇక్కడి నుంచి ఔత్సాహిక పేకాటరాయుళ్లు వాహహనాల్లో గ్రూపులుగా అక్కడికి వెళ్లి పేకాట ఆడేవారు. అందు కోసం ఇక్కడి నుంచి కొందరు మధ్యవర్తులు వాహనాలను అమర్చే వారు. ఇక్కడి నుంచి పేకాటరాయుళ్లను తీసుకెళ్లి తిరిగి రాత్రికి వారిని తమ వాహనాల్లో ఇంటికి చేర్చే వారు. అందుకు అక్కడి పేకాట నిర్వాహకులు వారికి వ్యక్తి ఇంత అని ముట్టచెప్పేవారు. ఇలా సులభంగా రోజు వేలల్లో డబ్బులు వస్తుండడంతో మధ్యవర్తులు దీనిని నిత్య ఉద్యోగంగా మార్చుకుని పేకాటరాయుళ్లను మహారాష్ట్రకు తరలించేవారు.

పేకాటపై మహారాష్ట్ర పోలీసుల నిఘా

జిల్లా సరిహద్దుల్లో ఉన్న మహా రాష్ట్రంలోని పలు పట్టణాల్లో పేకాట జోరందుకోగ ఇటీవల వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అక్కడి పోలీసులు పేకాట స్థావరాలపై నిఘా పెంచింది. పేకాట ఆడుతున్న సమాచారాన్ని తెలుసుకుని అక్కడ దాడులకు దిగడంతో పేకాటరాయుళ్లు సందిగ్ధంలో పడ్డారు. ఇటు జిల్లాలో పేకాట ఆడలేక, అటు మహారాష్ట్రకు వెళ్లలేక సతమవుతున్నారు. గతంలో ఉన్న పోలీసు అధికారులు పేకాట నిర్వాహకుల వద్ద నుంచి నెల నెల లక్షల్లో మాముళ్లు తీసుకుని పేకాటను నడిపించేవారు. కానీ ఇటీవల పోలీసు శాఖలో జరిగిన మార్పుల వల్ల అక్కడి పోలీసులు పేకాటపై ఉక్కుపాదం మోపడంతో పేకాటరాయుళ్ల జిల్లాకు తిరుగుముఖం పడుతున్నారు.

అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు

జిల్లాలో పేకాటను నియంత్రించేందుకు పోలీసు శాఖ పేకాట స్థావరాలపై ఉక్కుపాదం మోపుతోంది. ముఖ్యంగా ఆర్మూర్ డివిజన్‌తో పాటు జిల్లా కేంద్రంలోని అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేసింది. పేకాటపై పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌సింగనేవార్ సీరియస్‌గా ఉండడంతో పేకాట రాయుళ్లకు మింగుడు పడడంలేదు. ఎవరికి అనుమానం రాకుండా పకడ్బందీ ప్రణాళికతో పేకాటను నిర్వహిస్తున్న పోలీసులు మాత్రం ఎత్తుకుపై ఎత్తులు వేస్తూ పేకాట స్థావరాలపై దాడులు చేస్తున్నారు. దీంతో పేకాటను కొందరు ఎవరికి అనుమానం రాకుండా ఉండేందుకు పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్నవారు, ఉద్యోగుల సహకారంతో పేకాటను కొనసాగిస్తున్నారు. ఇటీవల పలు దాడుల్లో పట్టుపడ్డవారిలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలతో పాటు పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న వారు సైతం దాడుల్లో పట్టుపడ్డవారిలో ఉండడం గమనార్హం. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్, గంగాస్థాన్, శివారుకాలనీలు, దుబ్బా లాంటి ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న వారిపైదాడులు చేసి వారిపై కేసులు నమోదు చేస్తుండడంతో పేకాటరాయుళ్లు పేకాట ఆడేందుకు జంకుతున్నట్లు సమాచారం. అయినప్పటికీ పోలీసులు జిల్లాలో పేకాట పూర్తిగా నియత్రించలేక పోతున్నారు.

జిల్లాలో దాడులను కొనసాగిస్తున్నాం..

: ఎల్.రాజవెంకటరెడ్డి, ఏసీపీ (నిజామాబాద్)



జిల్లాలో పేకాటను నియంత్రించేందుకు పేకాట స్థావరాలపై దాడులు కొనసాగిస్తున్నాం. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ సింగనేవార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం సమన్వయంతో దాడులు చేస్తున్నాం. ప్రజలు సైతం పోలీసు శాఖకు సహకారం అందించి పేకాట ఆడుతున్న వారి సమాచారం ఇస్తే ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.



లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేస్తున్న మేయర్ నీతూ కిరణ్

ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 18: జిల్లా కేంద్రంలోని పోచమ్మ గల్లీలో కొలువుదీరిన 63 అడుగుల మట్టి వినాయకుడిని బుధవారం నిమజ్జనం చేశారు. రవితేజ యూత్ ఆధ్వర్యంలో 11 రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించిన కమిటీ సభ్యులు నీటితో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేశారు. అనంతరం లక్కీడ్రా నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ దండు నీతూకిరణ్, ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, మండప అధ్యక్షుడు రాజు, చందు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



• జెండాకు పూజలు చేస్తున్న భక్తులు

విద్యావ్యవస్థను పటిష్టం చేయాలి

- వసతిగృహాలు, పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలి
- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు



సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఇతర అధికారులు

నిజామాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో విద్యావ్యవస్థను పటిష్ఠం చేసి విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును అందించాలని, జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల పనితీరు మెరుగుపడేలా అధికారులు అంకితభావంతో కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి బుధవారం ఆయన సమీక్షించారు. క్షేత్రస్థాయిలోని అధికారులందరూ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పేద విద్యార్థులు చేరుతున్నందున వారికి నాణ్యమైన విద్య అందే విధంగా చూడాలన్నారు. విద్యార్థులందరూ చక్కటి ప్రతిభను కనబర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి పనిచేయాలన్నారు. ఆ వసతి గృహాల్లో మూడేళ్లుగా విద్యార్థులు సాధించిన ఉత్తీర్ణతను ఆయన సమీక్షించారు. వార్షిక పరీక్షల్లో హాస్టల్ వారిగా వివరాలను తీసుకున్నారు. వసతిగృహాల్లో ఉన్న లోటుపాట్లను సమీక్షిస్తూనే అందరూ అందుబాటులో ఉండాలని కోరారు. వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. విద్యావ్యవస్థకు చక్కటి మార్గదర్శకాలను చేయడంతో పాటు విద్యార్థులకు అన్ని వసతులను సమకూర్చవల్సిన బాధ్యత సంక్షేమ అధికారులపై ఉందన్నారు. వసతిగృహాల్లో చదివే విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 75 శాతంకు పైగా మెరిట్ సాధించే విధంగా చూడాలన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దేందుకు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సరైన సదుపాయాలు అందించాలి..

జిల్లాలోని వసతిగృహాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యాబోధనతో పాటు సరైన వసతి సదుపాయాలు ఉండే విధంగా పర్యవేక్షించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు కోరారు. తనతో పాటు అధికారులందరూ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. నిర్వాహణ లోపాలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. సంక్షేమ అధికారులు ఎల్లప్పుడు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని రాత్రివేళల్లో వసతిగృహాల్లోనే నిద్ర చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, వివిధ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన జెండా బాలాజీ జాతర

- పూలాంగ్ వరకు జెండా ఊరేగింపు
- భక్తులతో కిటకిటలాడిన నగరంలోని గోల్‌హనుమాన్ చౌరస్తా

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 18: పదిహేను రోజులు ఎంతో వైభవంగా జరిగిన జెండా బాలాజీ జాతర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు, జెండాకు ఆలయ వంశపార అర్చకులు అజయ్ సంగ్వాయ్, సంజు సంగ్వాయ్, విజయ్ సంగ్వాయ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల గోవిందనామస్మరణ మేళతాళాలతో ఆలయం నుంచి జెండాను, ఉత్సవ మూర్తులను సిర్నాపల్లి జానకీబాయి గడి వరకు తీసుకెళ్లి ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి ప్రత్యేక పూజలు జరిపారు. కొద్దిసేపు జెండాను గోల్ హనుమాన్ చౌరస్తా వద్ద నిలుపగా భక్తులు మొక్కులు చెల్లించుకొని పూజించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను, జెండాను పూలాంగ్ వరకు తీసుకెళ్లి అక్కడ ప్రతిష్ఠించారు. ఆలయ అర్చకులు జెండాకు, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఐదు రోజుల పాటు పూలాంగ్ చౌరస్తా వద్ద భక్తులు దర్శించుకునే విధంగా జెండాను ఉంచనున్నారు. జెండా జాతర ఉత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ దండు నీతూకిరణ్, ఆలయ చైర్మన్ జాలిగం గోపాల్, కార్యనిర్వాహణ అధికారి వేణు, ఆలయ పాలక మండలి సభ్యులు, పాల్గొన్నారు.



• జెండాకు పూజలు చేస్తున్న భక్తులు

బాలాజీని దర్శించుకున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నగరంలోని జెండా బాలాజీని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి దర్శించుకున్నారు. జెండా బాలాజీని జాతర ఉత్సవాల్లో దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. దేవుడి దయతో అందరూ ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలని భగవంతున్ని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన జెండాను దర్శించుకొని పూజలు చేశారు. వేదపండితులు ఎమ్మెల్యేకు స్వామివారి శేషవస్త్రాన్ని అందించి ఆశీర్వదించారు.

బై..బై.. గణేశా



• కొటార్మూర్ పెద్దచెరువులో భారీ వినాయకుని నిమజ్జనం





• ఆర్మూర్‌లో కొనసాగుతున్న గణేష్ నిమజ్జన శోభాయాత్ర



• రుద్రూరు చెరువులో గణేష్ నిమజ్జనం



రెండో రోజూ కొనసాగిన నిమజ్జనం

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 18: జిల్లా వ్యాప్తంగా రెండో రోజైన బుధవారం గణేష్ నిమజ్జనం కొనసాగింది. గత ఏడాది కంటే ఈసారి అధిక సంఖ్యలో గణేష్ మండపాలు ఏర్పాటు చేయడంతో నిర్వాహకులు రెండవ రోజు నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణనాథులను ఎక్కించడానికి కావాల్సిన లారీలు అందుబాటులో లేకపోవడంతో గణనాథులను నిమజ్జనం చేయడానికి మండపాల నిర్వాహకులు ఎదురు చూడక తప్పలేదు. రెండో రోజున జిల్లా కేంద్రంలో భారీ గణనాథులను పోలీసులు ఎప్పటికప్పుడు నిర్వాహకులకు సూచనలు చేస్తూ నిమజ్జన ప్రక్రియను ప్రశాంతంగా జరిగేలాగా చర్యలు తీసుకున్నారు. భారీ వినాయకులను బాసర గోదావరి, ఉమ్మెడ, యంచ ప్రాంతాలకు తరలించారు. చిన్న విగ్రహాలను వినాయక్‌నగర్‌లోని గణపతి బావిలో నిమజ్జనం చేశారు. గణపతి బావి వద్ద రెండో రోజు సైతం నిమజ్జన ప్రక్రియ జరిగేంతవరకు పోలీసుల బందోబస్తు కొనసాగింది.



నిమిశాంబదేవి ఆలయానికి విరాళం



ముప్కాల్, సెప్టెంబరు 18: బాల్కొండలోని నిమి శాంబదేవి ఆలయానికి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం లింబాయి జ్ఞాపకార్థం వారి కుమారుడు పీఆర్.నర్సింగ్‌రావు బుధవారం ఆలయ నిర్వాహకులకు రూ.40వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రానున్న నవరాత్రి ఉత్సవాల కోసం ఆలయానికి రంగులు వేసి, విద్యుత్‌దీపాలతో సిద్ధం చేసేందుకు ఉపయోగించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. నర్సింగ్‌రావు ద్వితీయ కుమారుడు లింబేష్ నిమిశాంబదేవికి రూ.10వేల 400 విలువ గల 11తులాల మూడు గ్రాములు వెండితో చేయించిన కమలం పువ్వు హారాన్ని అందజేశారు. పురాతన ఆలయం కావడంతో పలువురు దాతలు ఆదుకుంటున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో ప్రతినెలా శుక్రవారం అన్నదానం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెండో అంతస్తు నిర్మాణానికి భూమిపూజ

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 18: నగరంలోని సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో రెండో అంతస్తు నిర్మాణం కోసం చైర్మన్ రమేష్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. కోటి రూపాయలతో నిర్మించే ఈ అంతస్తు కోసం ముందస్తుగా ఈ నిర్మాణానికి శిలాఫలకాన్ని వేశారు. బ్యాంకు కార్యకలాపాల కోసం ఈ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బ్యాంక్ పాలకవర్గం సభ్యులు సంగ్రామ్ నాయక్, గిరిదావర్ గంగారెడ్డి, సాంతేశ్వర్‌పటేల్, ముస్కుల సాయిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శరత్, కె.శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రమేష్ పాటిల్, భూమన్న, లింగయ్య, మోతిలాల్, శంకర్, ఆనంద్, భూషన్‌రెడ్డి, యాదగిరితో పాటు బ్యాంక్ సీఈవో నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 18: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో బుధవారం వరి పంటను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ వానకాలం సీజన్‌లో మహేంద్ర అండ్ మహేంద్ర ప్రైవేటు కంపెనీ సంస్థ మండలంలోని రైతులకు సుమారు 500ఎకరాలకు కంపెనీకి సంబంధించిన వరి విత్తనాలు ఇచ్చారు. రైతులు ఈ వరి పంటను సాగు చేస్తున్నారని, వారి ధన్యం గింజలు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. దీంతో రైతులు ఈనెల 16న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అనంతరం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ జక్రాన్‌పల్లిలో మహేంద్ర అండ్ మహేంద్ర వరి విత్తనాలు ఇవ్వగా రైతు ఈ పంటను సాగు చేస్తున్నారు. ఈ వరి పంటకు ధాన్యం గింజలు రాకపోవడంతో అన్వేష్‌రెడ్డి ఈనెల 16 పరిశీలించారు. ఈ పంటను పరిశీలిస్తారని అన్వేష్‌రెడ్డి రైతులకు వివరించగా బుధవారం జక్రాన్‌పల్లిలో వ్యవసాయ శాస్త్రవేత్తలు వచ్చి ధాన్యం గింజలు రాని వరి పంటను పరిశీలించారు. ఈ వరి పంటకు సుడిదోమ, కంకినల్లి వ్యాధులు ఆశించినట్టు గమనించినట్టు వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈసుడి దోమ, కంకినల్లి వ్యాధుల నివారణకు స్పైరోరిషిపిరన్, ప్రాఫికోనజోల్ కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్‌రూరల్ సహయ వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజేష్‌కుమార్, ఆర్ఏఆర్ఎ జాగిత్యాల శాస్త్రవేత్తలు డాక్టర్ గోనినాయక్, బలరాం, కెవికె శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్, వ్యవసాయాధికారిణి దేవిక, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఆలయంలో స్వామివారి పల్లకీ సేవ

మెండోర, సెప్టెంబరు 18: మండల కేంద్రంలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర ఆలయంలో స్వామివారి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర్ణమి రోజు పురస్కరించుకొని స్వామివారి ఉత్సవ మూర్తులను గోవింద నామాలతో ఆలయం చుట్టు ఊరేగించారు. పల్లకి సేవ ముందు మహిళలు మంగళహారతులతో భక్తులు ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ప్రదాన అర్చకులు, గ్రామప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ఏర్గట్ల, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో బుధవారం తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా అధికారులు పలు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా కరెంట్ బిల్లులకు సంబంధించిన వినతులు ఎక్కువగా రావడం జరిగిందని వాటి సమస్యను ఫీల్ట్ విజిట్ చేసి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ నారాయణ, రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్, ఏఈ సురేష్, లైన్‌మెన్ నవీన్‌లు పాల్గొన్నారు.

ప్రయాణికులకు తృటిలో తప్పిన ప్రమాదం

బోధన్‌రూరల్,సెప్టెంబరు 18: బాన్సువాడ నుంచి బోధన్ వస్తున్న బస్సులో ఉన్న ప్రయాణికులకు బుధవారం తృటిలో ప్రమాదం తప్పినట్లయింది. బాన్సువాడ నుండి బోధన్ వస్తున్న బస్సు పసుపు వాగు సమీపంలోకి రాగానే అజాగ్రత్తగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి డ్రైవర్ పంట పొలాల వైపు బస్సును మళ్లించాడు. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే బోధన్ ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ ఆర్టీసీ బస్సును వెనక్కి తెప్పించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్పించారు. దీంతో ప్రయాణికులు హమ్మయ్యా అంటూ ఊపిరిపీల్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి,సెప్టెంబరు 18: పొతంగల్ మండల కేంద్రంలో మంజీర నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం తహసీల్దార్ మల్లయ్య పట్టుకున్నారు. పొతంగల్ నుండి పొతంగల్ వైపు వెళ్తుండగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. ట్రాక్టర్‌యాజమానులపై సీఆర్‌పీఏఫ్ 107కింద కేసులు నమోదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాన్స్‌పోర్టు, మైనింగ్ అధికారులకు సమాచారం ఇస్తామన్నారు. ట్రాక్టర్ యాజమానులు ట్రాక్టర్‌లను ఇసుక రవాణాకు వినియోగించరాదని సూచించారు.

గుండెపోటుతో యువకుడి మృతి..?

మాక్లూర్, సెప్టెంబరు18: మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్యంపల్లి గ్రామానికి చెందిన మధు(27) అనే యువకుడు గుండెపోటుతో మరణించి ఉంటాడని ఎస్సై రాజశేఖర్ అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు బుధవారం మానిక్‌బండార్ హిందు యువజన సేన గణేష్ మండలి వారి యొక్క గణేష్ విగ్రహం నిమజ్జనం తీసుకువెళ్లడానికి తన ట్రాక్టర్‌లో గణేష్ నిమజ్జనం చేశారు. తెల్లవారు జామున 3గంటల సమయంలో కావడంతో రామాలయం గుడి ఆవరణలో విశ్రాంతి తీసుకున్నాడు. ఉదయం 8గంటలకు గణేష్ యువజన సభ్యులు అతనిని నిద్ర లేపగా అప్పటికే మృతి చెందిన ఉన్నట్టు వారు గమనించారు. స్థానిక డాక్టర్ వచ్చి చూడగా మృతి చెందినట్టు తెలిపారు. మృతుడు గుండెపోటుతో మరణించి ఉంటాడని, పోస్టుమార్టం నివేదిక వస్తే విషయం తెలుస్తోందని ఎస్సై రాజశేఖర్ తెలి పారు. మృతుని భార్య సంజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వినాయక శోభాయాత్రలో చిన్నపాటి ఘర్షణ

నవీపేట,సెప్టెంబరు 18: మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున వినాయక శోభాయాత్ర సందర్భంగా చిన్నపాటి గొడవ జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన వినాయక మండపానికి చెందిన యువకులు శోభాయాత్ర ద్వారా బాసరకు గణేష్ నిమజ్జనానికి వెళ్తున్నారు. స్థానిక మార్కండేయ ఆలయం సమీపంలోకి వచ్చిన శోభాయాత్రలో యువకులు నృత్యాలు చేస్తున్నారు. ఇదే సమయంలో తెల్లవారుజామున 3:30గంటల సమయంలో నిజామాబాద్‌కు చెందిన ముగ్గురు ట్రాన్స్‌జెండర్‌లతో పాటు మరో వ్యక్తి తమ వినాయకుడితో సహ యంచ గోదావరికి నిమజ్జనానికి తరలివెళ్తున్నారు. ఇదే సమయంలో యువకులతో కలిసి ట్రాన్స్‌జెండర్‌లు సైతం నృత్యంలో పాల్గొన్నారు.ఈ సమయంలో పలువురు యువకులు ట్రాన్స్‌జెండర్‌లతో అసభ్యంగా ప్రవర్తించడంతో ట్రాన్స్‌జెండర్‌లు, యువకులకు మధ్య గొడవ జరుగగా ట్రాన్స్‌జెండర్‌ల వెంట వచ్చిన వ్యక్తి తలకు గాయాలయ్యాయి. వెంటనే అతనిని స్థానికప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. ట్రాన్స్‌జెండర్‌లు సైతం తమదుస్తులను సొంతంగా తొలగించుకోవడంతో అక్కడి నుండి యువకులు పరారీ అయ్యారని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య


మృతుడు గంగాధర్

ఎడపల్లి, సెప్టెంబరు18: తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది కుర్నాపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి మం డలం కుర్నాపల్లి గ్రామానికి చెందిన గుత్పమాడ గంగాధర్ బ్రతుకు దెరువు కోసం నిజామాబాద్ వెళ్లి కసాబ్ గల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్నాడని, అతడు తాగుడుకు బానిసై తరచూ ఇంట్లో గొడవ పడుతూ ఇంట్లో నుండి వెళ్లిపోయి తిరిగి వచ్చేవాడని, గత పది రోజుల క్రితం డబ్బుల విషయంలో ఇంట్లో గొడవ పడి కోపంతో ఇంటి నుంచి వెళ్లిన తను ఇంటికి రాలేదని, కుర్నాపల్లి గ్రామస్థులు గ్రామ చెరువు చాకలి రేవు దగ్గర పొదలో గంగాధర్ చనిపోయి పడి ఉన్నాడని గ్రామానికి చెందిన చాకలి సురేష్ అతని భార్య సావిత్రికి సమాచారం అందించడంతో కుర్నాపల్లి గ్రామానికి వచ్చి చూడగా తన భర్త నిజంగానే చనిపోయాడని తెలుసుకుని ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసిందని, ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలి

బోధన్‌రూరల్,సెప్టెంబరు 18: ఆర్టీసీ అభివృద్ధికి ఆర్టీసీ డ్రైవర్‌లు, కండక్టర్‌లు, సిబ్బంది కృషి చేయాలని నిజామాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి అన్నారు. బుధవారం బోధన్ ఆర్టీసీ డిపోలో త్రైమాసికంలో ఉత్తమ ప్రతిభకనబర్చిన ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డులు తీసుకున్న వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా ఉద్యోగులు కూడా కష్టపడి పనిచేస్తూ అవార్డులు అందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్టీసీ డీఎం శ్రీనివాస్‌లతో ఆర్టీసీ సిబ్బంది తదితరులున్నారు.

గ్రామాల వారీగా ఓటర్ల జాబితా తయారు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 18:జిల్లాలోని శాసన సభ నియోజకవర్గాలలోని పోలింగ్ స్టేషన్ల వారిగా ఉన్న ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీల వారిగా, వార్డుల వారిగా తయారు చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 27 మండలాల పరిధిలోని 545 గ్రామ పంచాయతీలలో 5020 వార్డుల యొక్క ఓటర్ల జాబితా టి-పోల్ సాఫ్ట్‌వేర్ నందు పొందుపర్చి 13 సెప్టెంబర్ రోజున ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితాను అన్ని గ్రామ పంచాయతీలనందు వార్డుల వారిగా ప్రదర్శించడం జరిగిందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన కార్యచరణ ఆధారంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అధ్యక్షతన బుధవారం గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈనెల 14నుంచి 21 వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నామని, 25వ తేదీ వరకు వాటిని పరిష్కరించి 28వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వార్డుల వారిగా తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు.

'గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా హర్షణీయం'

సిరికొండ సెప్టెంబరు 18 :గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఎంతో మేలు చేస్తుందని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు బండారి నరేష్ అన్నారు. గల్ఫ్‌లో పనిచేస్తు మృత్యువత పడుతున్న కార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం తన వంతు బాధ్యతగా ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల నరేష్ హర్షం వ్యక్తం చేశారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని నరేష్ ప్రభుత్వాన్ని కోరారు

ఇరువర్గాల మధ్య ఘర్షణ

దోమకొండ, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని ఒకే కులానికి చెందిన వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో ఇరువర్గాల వ్యక్తులకు గాయాలు కావడంతో వారితో పాటు ప్రభుత్వాసుపత్రికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. విషయం తెలుసుకున్న సీఐ సంపత్ కుమార్, ఎస్సై ఆంజనేయులు ఆసుపత్రికి చేరుకుని వారిని సముదాయించి పంపించారు. ఇరువర్గాల్లో రెండు పార్టీలకు చెందిన వ్యక్తులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు.

రెండో రోజూ సాగిన గణేష్ నిమజ్జన శోభాయాత్ర


ఎడపల్లి గణేశ్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


రుద్రూరులో ...


అర్గుల్‌లో నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు

ఎడపల్లి, సెప్టెంబర్18: ఎడపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల గణేశ్ మండపాల నిర్వాహకుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు గణేష్ శోభయాత్రను శాంతియుతంగా జరుపుకున్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు బ్యాండ్ మేళాలతో, భాజా భజంత్రీలతో, నృత్యాలతో శోభయాత్రలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎడపల్లి పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. చెరువుల వద్ద చెరువు లోపలికి ఎవరిని వెళ్లనివ్వకుండా ప్రజలను, భక్తులను అప్రమత్తం చేశారు. మండలంలోని చెరువులలో వినాయకులను నిమజ్జనం చేశారు. భక్తులు చెరువు లోపలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

నవీపేట: మండలంలోని యంచ గోదావరిలో రెండవ రోజైన బుధవారం వినాయక నిమజ్జనం కొనసాగింది. మంగళవారం మధ్యాహ్నం ప్రారంభమైన వినాయక నిమజ్జనం బుధవారం రాత్రి వరకు కొనసాగింది. బుధవారం సాయంత్రం వరకు 420 వినాయక విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేయడం జరిగిందని అధికారులు పేర్కొన్నారు. బుధవారం అర్ధరాత్రి వరకు వినాయక నిమజ్జనం కొనసాగే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బాసర వేద పాఠశాలకు చెందిన విద్యార్థులు వినాయక నిమజ్జనంలో పాల్గొన్న అధికారులు, ఇతర సిబ్బందికి కూల్‌డ్రింక్‌లు, స్నాక్‌ను అందజేశారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో బుధవారం గణేష్ నిమజ్జనం ఘనంగా ముగిసింది. మంగళవారం రాత్రి నుండి కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాలలో నిమజ్జన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. తెల్లవారుజాము వరకు శోభాయాత్ర కొనసాగింది. బుధవారం ఉదయం ఆయా గ్రామాలలో చెరువులు, మంజీర నదిలో వినాయకులను నిమజ్జనం చేశారు.

రుద్రూరు: పదకొండు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. రుద్రూరు మండల కేంద్రలో 11 రోజులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించిన భక్తులు చివరి రోజు మంగళవారం రాత్రి సందడిగా ఊరేగింపులు నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో యువకులు నృత్యాలు చేయగా సార్వజనిక్, నవయుగ గణేష్ మండలిల ఆధ్వర్యంలో భక్తి శ్రద్దలతో భజన కార్యక్రమాలు చేసుకుంటూ నిమజ్జనానికి వినాయకులను తరలించారు. గణేష్ మండపాల వారి బ్యాండ్ మేళాలు, డప్పు చప్పుళ్లతో మండల కేంద్రం మారుమోగింది.

● ప్రశాంతంగా శోభాయాత్ర....

రుద్రూరు మండల కేంద్రంలో వివిధ మండపాల వారి ఆధ్వర్యంలో గణేష్ శోభయాత్రను శాంతియుతంగా జరుపుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా రుద్రూరు పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. చెరువు వద్ద చెరువు లోపలికి ఎవరిని వెళ్లనివ్వకుండా ప్రజలను, భక్తులను అప్రమత్తం చేశారు.గణేష్ మండపాల నిర్వాహకులు బ్యాండ్ మేళాలతో, భజా భజంత్రీలతో డ్యాన్సులతో శోభాయాత్రలో పాల్గొన్నారు.అదే విధంగా రుద్రూరు కేంద్రంలో చెరువులో పెద్ద ఎత్తున వినాయకులను నిమజ్జనం చేశారు. నిర్వాహకులు చెరువు లోకి వెళ్లకుండా ఒడ్డుపైనే పూజలు నిర్వహించి వినాయకులను గంగమ్మ ఒడిలోకి చేర్చారు.భక్తులు చెరువులోపలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

● రుద్రూరు జాతర ఉత్సవాల్లో ఆకట్టుకున్న భజన, భక్తి గీతాలు

గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రుద్రూరు మండల కేంద్రంలో గణనాథులకు ఘనంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం రాత్రి నిర్వహించిన జాతర ఉత్సవాలలో భాగంగా శ్రీ సార్వజనిక్ గణేష్ మండలి కైలాష్ బృందం, నవయుగ గణేష్ మండలి శబరి సాయి భజన మండలిల ఆధ్వర్యంలో భజన, భక్తి గీతాలు, భరతనాట్యం వంటి ఆర్కెస్ట్రా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వినాయక పూజలను చేసి జాగరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన భజన, భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిదిలో గణేష్ నిమజ్జనం రెండో రోజు బుధవారం కొనసాగింది. పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద గణనాథులు శోభాయాత్ర యువకులు నృత్యాలు చేశారు. అదే విధంగా గూండ్ల చెరువు వద్ద గణేష్ నిమజ్జనం కోసం భారీగా గణనాథులు విచ్చేశాయి. అలాగే పెర్కిట్, మామిడిపల్లిలో బుధవారం సాయంత్రం వరకు గణనాథులు శోభాయాత్ర కొనసాగగా డీజేలతో పోటాపోటీగా యువకులు డ్యాన్స్‌లు చేసూ గణేష్ నిమజ్జనం నిర్వహించారు. గణనాథుల నిమజ్జనానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి వీక్షించారు.

● గణేష్ లడ్డు పొందిన భక్తుడు..

ఆర్మూర్ పట్టణంలోని పెద్దబజార్‌లోని గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డు ప్రసాదం లక్కీ డ్రాలో బోండ్ల ఆనంద్ లత లడ్డును దక్కించుకున్నారు. 11రోజుల పాటు పూజలందుకుని గణపతి చేతిలోని లడ్డు పొందడం ఆనందంగా ఉందన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం వివిధ గ్రామాల్లో గణేష్ నిమజ్జనం బుధవారం రాత్రి వరకు కొనసాగింది. మండలంలోని పెర్కిట్, కొటార్మూర్, మామిడిపల్లితో పాటు ఆలూర్ మండల కేంద్రం, వివిధ గ్రామాలలో భారీ గణపతులను రాత్రి మండపాల నుంచి కదిలించి భజనలు, నృత్యాలు చేస్తూ యువకులు డ్యాన్స్‌లతో నిమజ్జనానికి తరలించారు. రెండు రోజుల పాటు సాగిన వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది.

జక్రాన్‌పల్లి:మండలంలోని అన్ని గ్రామాల్లో గణేష్ మంగళవారం నుంచి బుధవారం వరకు గణేష్ శోభాయాత్ర కొనసాగుతుంది. ఇప్పటికే గ్రామాల్లో గణేషులను నిమజ్జనం చేశారు. పౌర్ణమి ఉన్నందున బుధవారం వివిధ గ్రామాల్లో గణేష్ నిమజ్జనం నిర్వహించారు. గణేష్ మండల సభ్యులు భక్తిశ్రద్ధలతో నిమజ్జన శోభ నిర్వహించి ఆనందోత్సవాల మధ్య ఉత్సవాలను జరుపుకున్నారు. అనంతరం స్థానిక చెరువులను గణనాథులను నిమజ్జనం చేశారు. ఆనందోత్సవాల మధ్య గణేష్ నిమజ్జనం జరుకున్నారు.

ముప్కాల్: బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలో గణపతి శోభాయాత్ర బుధవారం రోజు కొనసాగుతుంది. మంగళవారం సా యంత్రం నుంచి ప్రారంభమైన గణేష్ శోభయాత్ర బుధవారం వరకు కొనసాగుతుంది. గణేష్ శోభయాత్రలో యువకులు, మహిళలు నృత్యాలు చేస్తూ నిమజ్జనం నిర్వహించారు.

భీమ్‌గల్: మంగళవారం ప్రారంభమైన గణేష్ నిమజ్జన శోభయాత్ర బుధవారం వరకు సాగింది. పట్టణ కేంద్రంలోని వివిధ కాలనీలో గణనాథులు బెజ్జోర రోడ్డు నుంచి రాగులకుంటలో నిమజ్జనం చేశారు. నంది గల్లీలోని నందీశ్వర యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన భారీ వినాయకుడిని నిమజ్జన శోభయాత్రను పట్టణ ప్రజలు చూసేందుకు తరలివచ్చారు. గణేష్ శోభయాత్రలో ఏలాంటి వాంచనీయ సంఘటనలు జరుగకుండా సీఐ నవీన్‌కుమార్, ఎస్సై ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం వివిధ గ్రామాల్లో గణేష్ నిమజ్జనం బుధవారం రాత్రి వరకు కొనసాగింది. మండలంలోని పెర్కిట్, కొటార్మూర్, మామిడిపల్లితో పాటు ఆలూర్ మండల కేంద్రం, వివిధ గ్రామాలలో భారీ గణపతులను రాత్రి మండపాల నుంచి కదిలించి భజనలు, నృత్యాలు చేస్తూ యువకులు డ్యాన్స్‌లతో నిమజ్జనానికి తరలించారు. రెండు రోజుల పాటు సాగిన వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది.

మెండోర: మండలంలో నవరాత్రులు పూజలు అందుకుని వినాయకులు గ్రామ సమీపంలో ఉన్న చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా మండలంలో గణేష్ మండపాల నిర్వాహకులు మెండోర, బుస్సాపూర్, పోచంపాడ్, కోడిచర్ల, దూదిగాం, వెల్కటూర్, సావెల్, దూదిగాం, సోన్‌పేట్, చాకిర్యాల్, వెల్కటూర్‌తాండా గణపతులను గ్రామవీదులగుండా బ్యాంచ్ మేళలతో ఊరేగించి నిమజ్జనం చేవారు. మెండోర మండలంలో పోలీస్‌సిబ్బంది ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై నారాయణ బందోబస్తు నిర్వహించారు.


భీమ్‌గల్‌లో నిమజ్జనానికి తరలిన నందీశ్వర యూత్ భారీ గణపతి


కిసాన్‌నగర్‌లో కొనసాగుతున్న గణేష్ నిమజ్జనం దృశ్యం


యంచలో బోటింగ్ సిబ్బందికి కూల్‌డ్రింక్స్, స్నాక్స్‌ను అందజేస్తున్న విద్యార్థులు

రోడ్డు బాగైంది.. బస్సులు నడిపించండి..

సిరికొండ సెప్టెంబరు 18 : భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్డును కొండాపూర్, తూంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సంయుక్తంగా డబ్బులు వెచ్చించి బాగు చేయించారు. బస్సులు నడిపించాలి కమిటీల సభ్యులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.సిరికొండ మండలం కొండాపూర్ - రెడ్డిపేట్ తండాల మధ్య గల అడవీలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురయ్యింది. దీని వల్ల గత పందోమ్మిది రోజులుగా కామారెడ్డి -సిరికొండ - భీమ్‌గల్ మధ్య తిరిగే ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపివేశారు. కొండాపూర్ - తూంపల్లి గ్రామాభివృద్ధి కమిటీల సభ్యులు బుధవారం జేసీబీ, ట్రాక్టర్లతో వెళ్లి పాడై పోయిన రోడ్డును బాగు చేయించారు. కోతకు గురైన కల్వర్టు వద్ద మట్టిని నింపారు. రోడ్డు బాగు చేశారు. బస్సులు వెంటనే ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. తాత్కాలిక మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన చేయాల్సిన రోడ్డు భవనాల శాఖ అధికారులు ఈ రోడ్డు తమకేమి పట్టదన్నట్లు మిన్నకుండి పోయారు. కొండాపూర్, తూంపల్లి గ్రామాల ప్రజలు అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతు పనులు చేస్తామంటే రోడ్డు భవనాల శాఖ అధికారులు అడ్డుకోవడం వల్ల బస్సులు రాకపోఇవడం వల్ల పందోమ్మిది రోజులుగా ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. బుధవారం తూంపల్లి, కొండాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మూకుమ్మడిగా ట్రాక్టర్లు, జేసీబీతో వెళ్లి రోడ్డును బాగు చేయించారు. అధికారుల నిర్లక్ష్యానికి ఇబ్బంది పడ్డ ప్రయాణికులు...కామారెడ్డి ప్రాంత రోడ్డు భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యానికి తాము ఇబ్బంది పడ్డామని కొండూర్ గ్రామాబివృద్ధి కమిటీ అధ్యక్షుడు సీరడి శ్రీధర్ అన్నారు. తాము వారం పది రోజలు క్రితమే రోడ్డును బాగు చేయించే వారమని రోడ్డు భవనాల శాఖ అధికారులు అడ్డుకోవడం వల్లె 18 రోజులు ఆలస్యం జరగిందన్నారు.రోడ్డు మరమ్మతు పనులను రెండు గ్రామాల కమిటీ సభ్యులు పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు అబ్బాస్, కిరణ్,జగన్,రమేష్,రాంసింగ్,సాయిలు,రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పర్యవేక్షించారు.


భారీ వర్షానికి దెబ్బతిన్న రోడ్డును బాగు చేయించిన గ్రామస్థులు

గణేష్ నిమజ్జన ఊరేగింపులో పరస్పర దాడులు

మోర్తాడ్, సెప్టెంబరు18: మండల కేంద్రంలోని గణేష్ ఊరేగింపులో పలువురు పరస్పరదాడులు చేసుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి గణేష్ నిమజ్జన శోభయాత్రలో డీజేలచే ఊరేగింపు నిర్వహించారు. పోటాపోటీ జరిగిన ఊరేగింపులో చిన్నపాటి ఘర్షణ పెద్ద గా సంఘటనకు చోటు చేసుకుంది. ఈ ఘటన అర్ధరాత్రి ఒంటి గంటకు ఊరేగింపు కొనసాగగా పలువురు యువకులు దాడులకు దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి డీజేలను సీజ్ చేసి గణపతి ఊరేగింపు సజావుగా సాగేలా చేశారు. నిమజ్జన ఊరేగింపులో కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి, భీమ్‌గల్ సీఐ నవీన్‌లు రాత్రిళ్లు బందోబస్తు నిర్వహించారు.

కాకతీయ కాలువలో యువకుడి గల్లంతు

మెండోర, సెప్టెంబరు18: మండల కేంద్రానికి చెందిన ద్యారంగుల చిన్న మల్లైన్న(32) మద్యానికి బానిసై కాకతీయ కాలువలో పడి గల్లంతైనట్టు ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మల్లైన్న మద్యానికి బానిసై గత కొన్ని రోజులుగా మద్యం తాగేవాడని తాగిన మత్తులో మెండోర గ్రామానికి అతి సమీపంలో కాకతీయ కాలువలో పడి గల్లంతు అయ్యాడని తెలిపారు. ప్రాజెక్టు అధికారులకు సమాచారం అందగానే కాకతీయ కాలువకు నీటి విడుదల నిలిపివేశారు. మల్లైన్నకు భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదచయలు అలుముకున్నాయి. మల్లై భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

'గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి'

ఎడపల్లి, సెప్టెంబర్ 18: గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, గ్రామంలో ఉన్న చెత్తను ప్రతిరోజు తొలగించాని బోధన్ ఇన్‌చార్జి డీఎల్‌పీవో మధుకర్ అన్నారు. ఎడపల్లి మండలంలోని రాణాకలాన్ గ్రామ పంచాయితీని బుదవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యాలయంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఉన్న పాఠశాలలో జరుగుతున్న స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలను, గ్రామంలో చేపడుతన్ను పారిశుధ్య పనులను పరిశీలించారు.

కత్తితో దాడి.. ఏడుతులాల బంగారు నగలు చోరీ


చికిత్స పొందుతున్న ధరావత్ మోహన్

నాగిరెడ్డిపేట, సెప్టెంబ రు 18 : గుర్తుతెలియని దుండగులు ధరావత్ మోహన్‌పైన కత్తితో దాడి చేసి అతన్ని తీవ్రంగా గాయ పరిచారు. దొంగతనానికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి నాగిరెడ్డిపేట మండలంలోని బంజారా తండా గ్రామంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన బాధితురాలు ధరావత్ నిర్మల తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బంజారా తండా గ్రామా నికి చెందిన ధరావత్ మోహన్ అతని భార్య ధరావత్ నిర్మల తమ కుమారునితో కలిసి మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా, అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని ముగ్గురు దుండగులు ఇంట్లోకి చొరబడ్డారు. దొంగతనానికి వచ్చిన దుండగులు ధరావత్ మోహన్, నిర్మలను తమ ఇంట్లో ఉన్న బంగారు నగలను చూపించాలని అడుగగా, వారు చూపించకపోవడంతో దుండగులు మోహన్‌పై కత్తితో దాడి చేశారు. మోహన్ మెడపై దుండగులు కత్తితో దాడిచేసి గాయపరిచినట్లు తెలిపారు. గాయపడిన మోహన్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దుండగులు మోహన్ భార్య మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడుతో పాటు ఇంట్లోని బీరువాలో ఉన్న సుమారు ఏడు తులాల బంగారు నగలను దొంగిలించుకుపోయినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీంద్రనాయక్, స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. జిల్లా కేంద్రం నుంచి క్లూస్‌టీమ్‌ను డాగ్ స్క్వాడ్‌లను రప్పించి విచారణ చేపట్టారు. దొంగతనానికి పాల్పడిన దుండగుల వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

నిఖత్ జరీన్‌కు డీఎస్పీ పోస్టింగ్


నియామక పత్రం అందజేస్తున్న డీజీపీ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18: అంతర్జాతీయ బాక్సర్ జిల్లాకు చెందిన నిఖత్ జరీన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం గత కొన్ని రోజుల క్రితం డీఎస్పీగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. బుధవారం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా జాయినింగ్ రిపోర్టును ఆమెకు అందజేశారు. నిఖత్ జరీన్ జాయినింగ్ రిపోర్టును డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్‌కు అందజేశారు. జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ రెండు సార్లు ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌గా గెలిచింది. కామన్‌వెల్త్ గేమ్స్‌లోనే బంగారు పతకం, ఆసియా క్రీడల్లో కాంస్య పతకాన్ని సాధిం చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేసి రాష్ట్రానికి మంచిపేరు తీసుకువస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నూతన భవనంలోకి కేంద్రీయ విద్యాలయం

బోధన్‌రూరల్,సెప్టెంబరు 18: బోధన్ పట్టణంలోని బెల్లాల్ ప్రాంతంలో ఉన్న కేంద్రీయ విద్యాలయాన్ని బుధవారం పాండుఫారంలో నూతనంగా నిర్మించిన నూతన భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా బుధవారం నుంచి తరగతులు, విద్యాబోధన ప్రారంభమైంది. ప్రస్తుతం 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఇక్కడే విద్య బోధన జరుగుతుందని, ప్రస్తుతం బెల్లాల్ నుండి పాండుఫారం నూతన భవనంలోకి మార్చినట్లు అధికారులు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో మొదటి తరగతిలో రెండో సెక్షన్‌తో పాటు 11వ తరగతి కూడా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

చేపలు పట్టడానికి వెళ్లి వ్యక్తి మృతి

నవీపేట,సెప్టెంబరు 18: నిజామాబాద్ మండలం తిర్మన్‌పల్లికి చెందిన దేవనమైన పోశెట్టి(49)అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కుంటలో మునిగి మృతి చెందాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. మంగళవారం ఉదయం తన సోదరుడైన డీ.పోశెట్టితో కలిసి బైక్‌పై మండలంలోని కోస్లీ గోదావరి సమీపంలో ఉన్న కుంటలో చేపలు పట్టడానికి వెళ్లారని గాలం నీటి కుంటలో తట్టుకోగా దానిని తీయడానికి యత్నించి దేవనమైన పోశెట్టి అందులో మునిగిపోయ్యాడని అన్నారు. మంగళవారం మృతదేహం కోసం గాలించినప్పటికీ లభ్యం కాలేదని బుధవారం అతని మృతదేహం బయట పడిందని అన్నారు. మృతుడి సోదరుడు డీ.పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

ఏర్గట్ల, సెప్టెంబరు 18: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవలే కురిసిన వర్షాలకు దెబ్బతిన పసుపు పంటతో పాటు ఆయిల్ ఫామ్ పంటలను బుధవారం జిల్లా జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ బండారి శ్రీనివాస్ రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి వినాయక్ రైతులు బద్ధం ప్రభాకర్, కొట్టాల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలు ఉన్న ప్రతీ ఏరియాలో వైద్య శిబిరాలు నిర్వహించాలి

» విధుల్లో అలసత్వం వహిస్తే తీవ్రంగా పరిగణిస్తాం: డాక్టర్ రాజశ్రీ



చౌట్‌పల్లి ఆసుపత్రి గదులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 18: జ్వరాలు ఉన్న ప్రతి ఏరియాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి తగు వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యవైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ అన్నారు.బుధవారం కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు సమీక్షసమావేశంలో మాట్లాడుతూ..జ్వరం ఉన్న ప్రతీకేసుకు రక్తపరీక్షలు చేయాలని ఆదేశించారు.ఆసుపత్రిపరిధి గ్రామాలలో ఇంటింట సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. అమ్మఒడి కార్యక్రమంలో లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు జరిగేవిధంగా ఆయా గ్రామాలలో ఏఎన్ ఎంలు, ఆశావర్కర్‌లు తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గురువారం వృద్ధులకోసం వైద్యశిబిరాలు నిర్వహించాలని అదేవిదంగా ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అప్పుడే మలేరియా, చికెన్‌గున్యా, డెంగీ లాంటి వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ప్రతీ ఉద్యోగి తమకు కేటాయించిన విధుల్లో అలసత్వం వహించరాదని, సమయపాలన పాటించాలని లేనిపక్షంలో తీవ్రంగా పరిణిచాల్సి వస్తుందన్నారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను పరిశీలించి ఆసుపత్రి నివేదికను ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సుప్రియ డీఎంహెచ్‌వోకు వివరించారు. ఆయన వెంట ఉపవైద్యాధికారి డాక్టర్ రమేష్, డివిజన్ మలేరియా నియంత్రణ అధికారి సాయి, పీహెచ్ సీ, హెచ్‌ఈవో, ల్యాబ్ టెక్నిషియన్, ఫార్మషిస్టు అరుణ్ గౌడ్ ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

జాగ్రత్తలతోనే పంటలను రక్షించుకోవాలి



ఇందల్వాయిలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ఇందల్వాయి, సెప్టెంబరు 18: వరి పంట పొట్టదశలో ఉన్నందున చీడపీడలు ఆశిస్తున్నాయని రైతులు తగు జాగ్రత్తలు తీసుకొని పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ సూచించారు. బుధవారం ఇందల్వాయి మండలంలోని వెంగళ్‌పాడ్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయి పంటలను పరిశీలించారు. పురుగు మరియు తెగుళ్ల ఆశించిన వరి పొలాలను పరిశీలించడం జరిగిందని ప్రస్తుతం వరి పంటకు ఆకు ముడత, ముగి పురుగు ఆశిస్తుందని దీని నివారణ కోసం క్లోరోప్లాంటమైసిన్ పిచికారి చేయాలని తెలిపారు. ముఖ్యంగా ఎండకు బ్యాక్టీరియా తెగుళ్ల ఆశిస్తుందని దీని నివారణ కోసం యూరియా వాడకం వాడకాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించారు. పంట పొలాల్లో మోతాదుకు మించి నీరు ఉంచరాదని తెలిపారు. ఎండాకు తెగుళ్ల ఉధృతంగా ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జాగ్రత్తలతోనే పంటలను కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి సతీష్, రైతులు తదితరులు ఉన్నారు.

పీజీటీ, టీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ సెప్టెంబరు 18 : సిరికొండ మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న పీజీటీ, టీజీటీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజేశ్‌రెడ్డి ప్రకటనలో కోరారు. మోడల్ స్కూల్లో ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి. పీజీటీ కెమిస్ట్రీ, పీజీటీ ఎకనామిక్స్,పీజీటీ జువాలజీ,పీజీటీ ఇంగ్లీష్ బోధించే ఉపాధ్యాయ పోస్టులతో పాటు, టీజీటీ గణితం,సైన్స్,హిందీ,ఇంగ్లీష్ టీచరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21వరకు పాఠశాలకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. 23న ఇంటర్వ్యూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పీజీటీ పోస్టులకు పీజీ, బీఎడ్, టీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, బీఎడ్, టెట్ పరీక్ష అర్హత కలిగి ఉండాలని ప్రిన్స్‌పాల్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు హవర్స్ బేసిస్‌పై వేతనాలు గరిష్టంగా రూ.18,200/లు వేతనంగా ఇవ్వనున్నామని ఆయన తెలిపారు. వివరాలకు సెల్.నెం.94907 71237కు కాల్ చేసి తెలుసుకోవాలని ఆయన కోరారు.

మహిళల ఆర్థిక సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్,సెప్టెంబరు 18: మహిళల ఆర్థిక సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, మహిళలు ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో న్యాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో మహిళలకు కుట్టు మిషన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా రాణించాలన్నారు. మహిళల సంక్షేమం కోసం నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మున్సిపల్ కమిషనర్ వెంకట్ నారాయణ, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నాగేశ్వర్ రావు, కౌన్సిలర్ శరత్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ న్యాక్ శిక్షణ కేంద్రం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తాం

ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం కావాల్సిన వసతులు ఏర్పాటు చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. జూనియర్ కళాశాలలో అధ్యాపకుల కొరతను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. విద్యార్థులు ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలను అధిగమించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మున్సిపల్ కమిషనర్ వెంకట్ నారాయణ, తహసీల్దార్ విఠల్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నాగేశ్వర్ రావు, కౌన్సిలర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థికి చెక్కును అందజేసిన సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్: కరీంనగర్ చెలిమెడ ఆనంద్‌రావు మెడికల్ కళాశాలలో వైద్య విద్య రెండవ సంవత్సరం చదువుతున్న జిల్లాకు చెందిన పేద విద్యార్థి టి.రాజుకు హెల్పింగ్ హార్ట్ ఫౌండేషన్ అండగా నిలిచింది. రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు రమన్‌రెడ్డి మరికొంత మంది ఉద్యోగులు కలిసి ఈ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఫౌండేషన్ ద్వారా ప్రతీ సంవత్సరం వైద్య విద్య చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్నారు. విద్యార్థి రాజు పేద కుటుంబం నేపథ్యంలో విద్యార్థికి అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో బుధవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా 25వేల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు రమన్‌రెడ్డి, కార్యదర్శి, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, సూపరింటెండెంట్‌లు శ్రీనివాస్‌రావు, విజయేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కల్దుర్కిలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

ఇందల్వాయి, సెప్టెంబరు 18:పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని సీడీపీవో స్వర్ణలత అన్నారు. ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి రైతు వేదికలో బుధవారం పోషన మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మారెడ్డి హాజరయ్యారు. పోషణఅభియాన్ మాసోత్సవాలు సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు కొనసాగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రాజ్‌కాంత్, స్థానిక వైద్యాధికారి సంతోష్, మండల విస్తీర్ణ అధికారి శంకర్, సూపర్‌వైజర్ శోభ, పోషన అభియాన్ దీప్తి, రంజిత్, పంచాయతీ కార్యదర్శి లావణ్య, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: చిన్న పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం అందించాలని ఏసీడీపీవో జ్యోతి అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఏడు నెలల పిల్లలకు అన్నప్రసాన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. చిన్న పిల్లల తల్లులకు పలు అంశాలపై అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ, అంగన్‌వాడి టీచర్‌లు రాజ్యలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని ఒడ్యాట్ గ్రామంలో అంగన్‌వాడి సెంటర్‌లో బుధవారం చిన్నపిల్లలకు అన్నప్రసాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఏడాది పోషణమాసంలో భాగంగా బుధవారం కార్యక్రమంనిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్‌లు అశవర్కర్ మమత, తల్లులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: మహిళలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని కల్దుర్కి గ్రామంలోని అంగన్‌వాడీ పాఠశాలలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది దివ్య, స్వప్న, అంగన్‌వాడీ టీచర్‌లు వత్సల, ఏఎన్ఎం పాల్గొన్నారు.

ధర్పల్లి:మండల కేంద్రంలోగల ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్ర లోపపోషణ, అతి తీవ్ర లోపపోషణ గల చిన్నారులకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. పోషన్ అభియాన్‌లో భాగంగా ప్రతి ఒక్క చిన్నారి ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో ఈ టెస్టును నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, అంగన్‌వాడి సూపర్‌వైజర్,అంగన్‌వాడి టీచర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

భీమ్‌గల్:పట్టణ కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో స్వర్ణలత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిస్తున్న పోషణ మాస వారోత్స వాలలో భాగంగా పట్టణ కేంద్రంలో అంగన్‌వాడి లబ్ధిదారులకు వంటల పోటీ లను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీపీవో జ్ఞానేశ్వరీ, సూపర్‌వైజర్ పోషణ అభియాన్ సమన్వయకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ కోసం పోటీ పడిన భక్తులు



న్యూఎన్‌జీవోస్ కాలనీలో గణపతి లడ్డూను సొంతం చేసుకున్న భక్తులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 18: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు లడ్డూ వేలం పాటలో లడ్డూను దక్కించుకోవడానికి పోటీ పడ్డారు. 11 రోజుల పాటు పూజలు అందుకున్న లడ్డూను దక్కించుకోవడం భక్తులు పవిత్రంగా భావించడంతో జిల్లావ్యాప్తంగా లడ్డూ వేలం పాట జోరుగా సాగింది. జిల్లా కేంద్రంలోని బ్యాంక్ కాలనీ గణేష్ మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుని లడ్డూను ఒకలక్షా 31వేల 111 రూపాయలతో సాయికృష్ణ దక్కించుకున్నాడు. అలాగే నగరంలోని న్యూఎన్‌జీవోస్‌లో గల శివశక్తి గణేష్ మండలి ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాట నిర్వహించారు. వేలంలో కాలనీకి చెందిన వనం పుల్లయ్య చంద్రకళ దంపతులు రూ.7,500కు లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో వనం వెంకటేశ్, రాజేష్, రత్నాకర్, పూదరి గణేశ్, స్వాతి, రిత్విశ్రీ, సాన్విక, తిరుపతి, సారిక, ధరణి, వజ్రధర్, వ్యాపారి నరేశ్, పద్మ, ధరణి, సాత్విక, హార్థిక్ తదితరులు పాల్గొన్నారు.

● రూ.లక్ష 500 రికార్డు ధర పలికిన గణేష్ లడ్డూ వేలం

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని నందిగల్లీలో నందీశ్వర యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేష్ వద్ద ఏర్పాటు చేసిన లడ్డు రికార్డు ధర పలికింది. నందిగల్లీకి చెందిన నర్సయ్య వేలంలో పాల్గొని రూ.లక్ష 500లకు లడ్డును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో నందీశ్వరయూత్ అధ్యక్షుడుఅశోక్, సభ్యులు హరిష్, చారి పాల్గొన్నారు.

20 నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్,సెప్టెంబరు18: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈనెల 20 నుంచి పీజీ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నట్లు అధ్యయన కేంద్ర రీజినల్ కోఆర్డినేటర్ రంజిత ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్‌తో పాటు తప్పనిసరిగా ఐడీప్రూఫ్ తీసుకొని రావాలని,మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ బీఆర్ఏవోయుఆన్‌లైన్.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, 7382929612 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

20న ఉద్యోగ మేళా

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 18: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 20న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూధన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సిఎంఆర్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో, భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ లిమిటెడ్ కంపెనీల ఆధ్వర్యంలో నిజామాబాద్, మేడ్చల్, హైదరాబాద్‌లలో పనిచేసేందుకు భారత్ మనీ ఆఫీసర్, ఫ్లోర్ సూపర్‌వైజర్, సేల్స్‌మెన్స్, రిసీవింగ్ స్టాఫ్, సెక్యూరిటీ స్టాఫ్, ఐటీ ఎగ్జిక్యూటీవ్ జాబ్‌లకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని డిగ్రీ పాసైన మహిళ, పురుష అభ్యర్థులు 10,ఇంటర్ పాసైన వారు కూడా జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని అన్నారు.ఆసక్తిగల అభ్యర్థులు జిల్లాఉపాధి కార్యాలయం ఐటీఐ గ్రౌండ్‌లో 20న ఉదయం 10.30ల నుంచి హాజరుకావాలని ఇతర వివరాలకు 9581768413,9948748428 నెంబర్లను సంప్రదించాలన్నారు.

21న ఉమ్మడి జిల్లాల జూడో ఎంపికలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18:స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల జూడో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు.నగరంలోని డీఎస్ఎ స్విమ్మింగ్‌పూల్ మైదానంలో అండర్-14బాలబాలికలు, అండర్-17 బాలబాలికలు, కేజీల విభాగాల్లో ఎంపికలు నిర్వహించనున్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 21న ఉదయం 10గంటలకు చేరుకోవాలన్నారు. బోనాఫైడ్ తెచ్చుకోవాలని,వివరాలకు నెం.7893973128 సంప్రదించాలని కోరారు.

'రైతులకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల మేలు'



తిరుపతిరెడ్డి

జక్రాన్‌పల్లి,సెప్టెంబరు18: రైతు ఉత్పిత్తిదారుల సంఘాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నానని రైతు ఉత్పిత్తిదారుల సంఘం ప్రధాన డైరెక్టర్ తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భార అభియాన్ పథకంలో భాగంగా భారతదేశంలో ఇప్పటికే పది వేల ఎఫ్‌పీవోకు గ్రూప్‌లు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు నెలకొల్పబడిందని, ఈ సంఘాల వల్ల లక్షల మంది రైతు లకు ఎంతో ఉపయోగం కలుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ ద్వారా రైతులు తమ ఉత్పత్తులను దళారుల పాలు కాకుండా కాపాడుతున్న సంస్థల్లో ఎంఎస్ ఎంఈ ముందు వరుసలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈని ప్రభుత్వం సహకారించడం అభినందనీయమన్నారు. రైతులకు అన్ని రకాల సహకారాలు అందు తుందన్నారు. ఎంఎస్‌ఎంఈ కమిటీని ఏర్పాటు చేసి అందులో రైతు ప్రతినిధులను రైతు ఉత్పత్తిదారుల సంఘాల డైరెక్టర్‌లను నియామించి నట్టేతే క్షేత్ర స్థాయిలో రైతులులాభం జరిగి అస్కారం ఉందన్నారు. ప్రభుత్వం ఆలోచన చేయాలని జీఎం కేబీఎస్, రైతు ఉత్పత్తిదారుల సంఘం తరపున ఆయన విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

డిచ్‌పల్లి, సెప్టెంబరు 18: బీఆర్ఎస్ పార్టీ దూస్‌గాం గ్రామ అధ్యక్షుడు సతీశ్ రెడ్డి తాతయ్య మృతి చెందడంతో వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్ లు పరామర్శించారు. అనంతరం ఖిల్లా డిచ్‌పల్లి ఉప సర్పంచ్ ఆసది రవీందర్ రోడ్డు ప్రమాదంలో గాయాలు కావడంతో ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట నీరాడి పద్మరావు, కృష్ణ, ఒడ్డం నర్సయ్య, సాయిలు, ఉన్నారు.

సానిటేషన్ పనులపై దృష్టి సారించండి

ధర్పల్లి, సెప్టెంబరు 18: సానిటేషన్ పనులపై దృష్టి సారించాలని ఎంపిడివో బాలకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను, ముళ్ల పొదళ్లను తొలగించారు. గతంలో ఉన్న రోడ్లను ప్రస్తుతం ఉన్న రోడ్లతో పోల్చారు. ప్రతీరోజు గ్రామాల్లో పారిశుధ్యం పనులను పర్యవేక్షించాలన్నారు.

బీజేపీ నాయకుల దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

నిజామాబాద్ అర్బన్,సెప్టెంబరు 18:రాహుల్ గాంధీపై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఢిల్లీ మాజీ ఎమ్మెల్యే తర్వీందర్ సింగ్,కేంద్ర మంత్రి రవణీత్ బిట్టుల దిష్టిబొమ్మలను కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు దహనం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్‌చౌదరి ఆదేశాల మేరకు బీజేపీ నేతల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నగర కార్పొరేటర్ గడుగు రోహిత్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో విమర్శలు ప్రతి విమర్శలు ఉండాలి కానీ చౌకబారు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాహుల్ గాంధీ పద్ధతి మార్చుకోవాలని లేకుంటే వాళ్ల నాన్నమ్మకు పట్టిన గతే పడుతుందంటూ బీజేపీ నేతలు బహిరంగంగా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. కేంద్రమంత్రి హోదాలో ఉండి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిని ఉగ్రవాదిగా పోల్చడం హేయమైన చర్య అని అన్నారు. దేశంలో రాహుల్‌గాంధీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ నేతలు కొంత మంది చౌకబారు వ్యాఖ్యలు చేయిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవాజ్, మోయిన్, రషీద్, నిఖిల్‌రెడ్డి, నరణ్‌దీప్, రాహుల్, బన్ని, తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికివేసిన వారికి రూ.50వేల జరిమానా

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు18: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో చెట్లు నరికి వేసిన వారికి రూ.50వేల జరిమానా విధించినట్లు ఫారెస్ట్ రెంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కళాశాలలో చెట్లు నరికిన విషయమై విచారణ జరిపిన అధికారులు బాధితులను గుర్తించి జరిమానా వేశారు. గత ఆదివారం అటవీ శాఖ అనుమతులు లేకుండానే చెట్లను నరికివేశారని అధికారులు తెలిపారు.

గడ్కోల్ గుడిలో చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

సిరికొండ సెప్టెంబరు 18 : మండలంలోని గడ్కోల్ గ్రామంలో హనుమాన్ మందిరంలో దొంగతనానికి యత్నించిన గుండెల సుమన్ అనే వ్యక్తిని అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై ఎల్.రామ్ తెలిపారు. ఈ నెల 5న సిరికొండలో ఒక స్వీట్ హోంలో తాళాలు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లిన సంఘటనలో సుమన్ ఉన్నాడని, మంగళవారం రాత్రి గడ్కోల్ హనుమాన్ మందిరంలో దొంగతనానికి యత్నించిన సంఘటనలో సుమన్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రామ్ తెలిపారు.

నేడు రుద్రూరులో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

రుద్రూరు, సెప్టెంబరు 18 : రుద్రూరు సబ్ డివిజన్ పరిధిలో నేడు (గురువారం) విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఏడీ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రుద్రూరు సబ్ డివిజన్ పరిధిలోని రుద్రూరు, కోటగిరి, పొతంగల్, వర్ని, చందూర్, మోస్రా మండల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ వేదికకు సీజీఆర్ఎఫ్-2 నిజామాబాద్ తరఫున మెంబర్స్ హాజరవుతున్నారని తెలిపారు.

నేడు రైతుల ఆందోళన

డిచ్‌పల్లి, సెప్టెంబరు 18: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఏలాంటి షరతులు లేకుండా 2లక్షల రూపాయల రుణ మాఫీ అర్హులైన ప్రతి రైతుకు చేయాలని, రైతు బంధు నిధులు విడుదల చేయాలనే డిమాండ్‌ల తో నేడు రైతులు డిచ్‌పల్లి తహసీల్ కార్యాలయం ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైతు జేఏసీ నాయకులు తెలిపారు. రైతులు హజరై విజయవంతం చేయాలని వారు ఒక ప్రకటన జారీ చేశారు.

పీడీఎస్‌యూ లోగో ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 18: పీడీఎస్‌యూ అర్థ శతాబ్దం నిండిన సందర్భంగా పీడీఎస్‌యూ 50వ వసంతాల లోగోను బుధవారం నగరంలోని మున్సిపల్ కార్యాలయం పార్క్ వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్,అధ్యక్షుడు కోనేరు సాయికుమార్, సీతయ్య, సుధాకర్, ప్రేమ్‌సింగ్, గోవర్ధన్, లింగం తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ సబ్సిడీ కార్డుల పంపిణీ

వేల్పూర్, సెప్టెంబరు18: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన మహాలక్ష్మీ పథకం గ్యాస్ సలిండర్ సబ్సిడీ కార్డులను బుధవారం వేల్పూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మహాలక్ష్మీ పథకం కింద రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నింటిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు అయ్యల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సంజీవ్‌యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజన్న పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.75100	రూ.69300	రూ.900

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : ప్రేమికుడు (10.00)
: మత్తు వదలరా (1.30, 7.45, 10.45)
: స్త్రీ-2 (4.30)
స్క్రీన్-2 : ఏఆర్ఎం (తెలుగు 3డి) (12.15, 7.00)
: సరిపోదా శనివారం (3.25, 10.10)
స్క్రీన్-3 : భలే ఉన్నాడే (10.25, 7.30)
: 35-చిన్నకథ కాదు (1.25, 10.30)
: మత్తు వదలరా (4.30)
స్క్రీన్-4 : ఉత్సవం (11.00, 7.15)
: తుంబ్బడ్ (హిందీ) (2.00)
: కలింగ (4.40)
: ది గోట్ (తెలుగు) (10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : 3 (తెలుగు) (10.20)
: సరిపోదా శనివారం (1.25, 7.20)
: 35-చిన్నకథ కాదు (4.35, 10.30)
స్క్రీన్-2 : ఏఆర్ఎం (తెలుగు 3డి) (4.20)
: 3 (తెలుగు) (7.30, 10.30)
స్క్రీన్-3 : 35-చిన్నకథ కాదు (10.50, 1.50)
: 3 (తెలుగు) (4.35)
: మత్తు వదలరా (7.40)

దేవి : మత్తు వదలరా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఉరుకు పటేలా (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఏఆర్ఎం (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్